సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 10 । ఏప్రిల్ । 2024




## జూన్ 1 నుంచి

జూన్ 1 నుంచి జూనియర్ కాలేజీలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు షెడ్యూల్ వచ్చేసింది. - 8లో



## కొత్త ఉత్సాహంతో..

ఎన్నికల ప్రచారాలు కొత్త ఉత్సాహంతో కొనసాగుతున్నాయి. ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. - 8లో




## న్యూస్‌రీల్

### తనిఖీల్లో రూ. 4.48 లక్షలు స్వాధీనం


డీటీ గాయత్రి తనిఖీల్లో పట్టుబడిన మొత్తాన్ని లెక్కిస్తున్న పోలీసులు

నరసన్నపేట: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వాహన తనిఖీలు ముమ్మరమవుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో పోలాకి మండలం రాళ్లపాడు కూడలి వద్ద రూ.1.64 లక్షలు, మడపాం టోల్‌గేట్ వద్ద రూ. 2,84,400 లను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి రశీదులు లేకపోవడంతో ఈ మొత్తాన్ని సీజ్ చేశారు. రాళ్లపాడు వద్ద స్థానిక డీటీ గాయత్రి ఆధ్వర్యంలోని స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.1.64 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే టోల్‌గేట్ వద్ద నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు తనిఖీలు చేపట్టారు. శ్రీకాకుళం నుంచి నరసన్నపేటకు బంగారం కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా ఒక కారులో రూ.2.84 లక్షలు పట్టుబడ్డాయి.

### జిల్లా స్థాయిలో ముగ్గురికి ఉగాది పురస్కారాలు


జిల్లా స్థాయి ఉగాది పురస్కార గ్రహీతలతో జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్‌పట్నాయక్

అరసవల్లి: క్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లా స్థాయిలో ముగ్గురు అర్చకులను మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖాధికారి బీఆర్ వీవీ ప్రసాద్‌పట్నాయక్ ఆధ్వర్యంలో శ్రీనివాసాచార్యులు ( శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయం-శ్రీకాకుళం), సీహెచ్ జగన్నాథాచార్యులు (శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం - పాతపట్నం), ఇప్పిలి సూర్యనారాయణ మూర్తి ( శ్రీమణి నాగేశ్వర స్వామి వారి ఆలయం- కళ్లేపల్లి)లను ఘనంగా సత్కరించారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల ప్రకారం ఒక్కో అర్చకునికి రూ.10,116 నగదుతో పాటు వస్త్రాలు, ప్రశంసాపత్రాన్ని అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ అందజేశారు.

### భారీగా నగదు పట్టివేత


పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం అంతర్ చెక్‌పోస్టు వద్ద ఎన్నికల నేపథ్యంలో చేస్తున్న తనిఖీల్లో రూ.6.75 లక్షల నగదు పట్టుకున్నారు. జేఆర్ పురం, పైడిభీమవరం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తి నుంచి శ్రీకాకుళం జిల్లాలోని సంతబొమ్మాళి వెళుతున్న చిర్ల సతీష్ రెడ్డి కారును మంగళవారం 10.30 గంటల సమయంలో పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేశారు. అందులో ఎలాంటి రశీదులు, ఆధారాలు లేని రూ.6లక్షల 75వేలు నగదు గుర్తించారు. సతీష్ రెడ్డి కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. నగదు వివరాలు రెండు రోజుల్లో సమర్పిస్తానని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జేఆర్ పురం ఎస్ఐ కె.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### 'నిబంధనల మేరకు మద్యం విక్రయాలు'

ఎచ్చెర్ల క్యాంపస్: ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున మద్యం అమ్మకాల్లో నిబంధనలు పాటించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎచ్చెర్ల ఏపీ బేవరేజెస్ యూనిట్ డిపో మేనేజర్ సుబ్బారావు చెప్పారు. ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందికి ఎచ్చెర్ల బేవరేజెస్ యూనిట్‌లో మంగళవారం పలు సూచనలు చేశారు. బారుల్లో గత ఏడాది రోజువారీ అమ్మకాలకు 30 శాతం మించి ప్రస్తుతం అమ్మకాలు జరగకూడదని తెలిపారు. స్టాక్ రిజిస్టర్లు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. బార్‌లు ఉదయం 11 నుంచి రాత్రి 11 వరకు, మద్యం దుకాణాలు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటలు వరకు నిర్వహించాలని అన్నారు. జీపీఎస్ డివైజ్ తప్పని సరిగా నిర్వహించాలని తెలిపారు. స్టాక్ రిజిస్టర్, సేల్ రిజిస్టర్ నిర్వహణ తప్పనిసరని పేర్కొన్నారు.


కొళిగాంలో సుజలధార నీటిని తీసుకెళ్తున్న మహిళలు

# సరిహద్దు సెగ్మెంట్‌లో ప్రగతి పొద్దు


మఖారాంపురంలో వైఎస్సార్ సుజలధారను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ (ఫైల్)

తూరుపు తీరాన ఉన్న ఇచ్ఛాపురంలో ప్రగతి పొద్దు పొడిచింది. దశాబ్దాలుగా శోకానికి అలవాటు పడిపోయిన కిడ్నీ బాధిత పల్లెల గొంతు తడిపేందుకు వంశధార పరుగులు పెట్టుకుంటూ వచ్చింది. బాధితుల కోసం స్థానిక ఆస్పత్రులకు కొత్త వసతులు వచ్చాయి. ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోడ్లకు ఈ ఐదేళ్లలోనే మోక్షం కలిగింది. దశాబ్దాల నిరీక్షణలకు ఫలితంగా నూతన పీహెచ్‌సీలు నిర్మాణమయ్యాయి. 2019–24 కాలాన్ని నియోజకవర్గ ప్రజలు మర్చిపోలేని రీతిలో ప్రభుత్వం వరాలు కురిపించింది.



- ఇచ్ఛాపురంలో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం
- కొత్తగా మౌలిక వసతుల కల్పన
- సంక్షేమ పథకాల ద్వారా పేదలకు రూ.1473.86 కోట్లు
- రూ.680.16 కోట్లతో అభివృద్ధి పనులు

కంచిలి:

రాష్ట్రానికి ముఖద్వారమైన ఇచ్ఛాపురంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టించింది. ఈ నియోజకవర్గం 1951 లో ఏర్పడిన నాటి నుంచి చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా 2019–24 మధ్య కాలంలో అభివృద్ధితోపాటు దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దొరికింది. కిడ్నీవ్యాధి మహమ్మారిని సమూలంగా తుదముట్టించడానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నడుంకట్టారు. ఇంటింటికి రక్షిత మంచినీటిని సరఫరా చేయాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును ఏర్పాటు చేసి జాతికి అంకితం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూ.680.16 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు సంక్షేమ పథకాల ద్వారా రూ.1473.86 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు.


ఇచ్ఛాపురం నుంచి కొళిగాంకు ఆర్టీసి బస్సు సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


పెద్దశ్రీరాంపురంలో జగనన్న కాలనీలో ఇళ్లు


సోంపేట సీహెచ్‌సీ

### ● కొత్త దారులు

- సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల ఉద్దానం గ్రామాలను కలిపే ఎస్‌కేఈ రోడ్డును రూ.31.80 కోట్లతో విస్తరించారు.
- ఇచ్ఛాపురం నుంచి పురుషోత్తపురం వరకు రోడ్డు అభివృద్ధిని రూ.5కోట్లతో చేపట్టారు. బూర్జపాడు నుంచి డొంకూరు వరకు రూ.3.67 కోట్లతో, కొల్లూరు రోడ్డును రూ.16లక్షలతో, బుడ్డెవుపేట నుంచి బాలకృష్ణాపురం రోడ్డు రూ.74లక్షలతో, పోలేరు రోడ్డును రూ.89.6లక్షలతో, మండపల్లి, రుషికుద్ద రోడ్డును రూ.65లక్షలతో అభివృద్ధి చేశారు.


నూతనంగా నిర్మితమైన ఎస్‌కేఈ రోడ్డు

### ● బస్సులు, రైళ్లు


సోంపేట స్టేషన్‌లో విశాఖపట్నం-బరంపురం ప్యాసింజర్‌కు స్వాగతం చెప్పి, లోకో పైలెట్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ (ఫైల్)

- ఇచ్ఛాపురం మండలంలో ఇచ్ఛాపురం నుంచి మశాకపురం, బిర్లంగి మీదుగా కొళిగాం వరకు 7 కిలోమీటర్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.
- విశాఖపట్నం–పలాస ప్యాసింజర్ రైలును బరంపురం వరకు విస్తరించడానికి, ఇచ్ఛాపురంలో వందే భారత్ రైలు హాల్టుకు కృషి చేసి సఫలీకృతమయ్యారు.

### ● విద్యకు ప్రాధాన్యం..


బారువ డిగ్రీ కళాశాల

నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం నాడు-నేడు పథకంతో పాఠశాలలు, కళాశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతోపాటు బారువ డిగ్రీ కళాశాలకు కొత్త భవనాల్ని రూ.5కోట్లతోను, సోంపేట జూనియర్ కళాశాలకు రూ.2కోట్లతో కొత్త భవనాల్ని నిర్మించారు.


కవిటిలో 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్

## దశాబ్దాల కలలను సాకారం చేశాం



ఇచ్ఛాపురంలో దీర్ఘకాలిక సమస్యలు ఎన్నింటినో ఈ ఐదేళ్లలో పరిష్కరించాం. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోరూ.58 కోట్లతో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశాం.

- వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టుకు రూ.700 కోట్లు ఖర్చుచేయగా, అందులో అగ్రభాగం రూ.400 కోట్లకుపైగా నిధులు ఇక్కడే వెచ్చించడం జరిగింది.
- రూ.20 లక్షలతో పైడిగాం చానెల్ మరమ్మతులు, రూ.30 లక్షలతో బారువ గ్రోయిన్ పునర్నిర్మాణ పనులు, రూ.15 లక్షలతో రుషికుద్దలో కొత్త షట్టర్లు, రూ.35లక్షలతో కేశపురం గ్రోయిన్ మరమ్మతులు చేపట్టాం.
- కవిటిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి 11కెవి సబ్‌స్టేషన్‌ను రూ.4.5కోట్లతో ఏర్పాటు చేశాం. ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ సమస్యలు అధిగమించడానికి రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా 4 మండలాల్లో 24 గంటలపాటు కరెంటు ఉండేందుకు త్రీఫేజ్ లైన్‌ను టౌన్‌ఫీడర్ రూ.5కోట్లతో ఏర్పాటు చేస్తున్నాం. ఇచ్ఛాపురం నుంచి రాజపురం మీదుగా బొరివంక సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ లైన్‌ను ఏర్పాటు చేశాం. కొర్లాం వద్ద 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదన ఫైనల్ స్టేజికి చేరింది. ఇక్కడ ఎలాంటి ఇండస్ట్రీ పెట్టాలన్నా 132 కేవీ సబ్‌స్టేషన్ ద్వారా కరెంటు సరఫరా చేయొచ్చు.
- ఇచ్ఛాపురం మండలం అరకభద్ర బ్రిడ్జిని రూ.12 కోట్లతోను, డొంకూరు, బూర్జపాడు బ్రిడ్జిలు రూ.17కోట్లతోను, బూర్జపాడు బ్రిడ్జిని రూ.10.5కోట్లతో మహేంద్రతనయ బ్రిడ్జిను రూ.14.6కోట్లతో, కొండిరేవు బ్రిడ్జిని రూ.3.5కోట్లతో మంజూరు చేశాం.
- వైద్య రంగానికి సంబంధించి ఇచ్ఛాపురం సీహెచ్‌సీని రూ.5 కోట్లతో, ఇచ్ఛాపురం, బెల్లుపడ యూపీహెచ్‌సిలను రూ.1.75 కోట్లు చొప్పున, ఈదుపురం, మాణిక్యపురం పీహెచ్‌సీలను రూ.1.75కోట్లుతో అభివృద్ధి చేశాం. కిడ్నీ డయాలసిస్ యూనిట్లను సోంపేట సీహెచ్‌సీలో 21 బెడ్స్‌ను, కవిటి సీహెచ్‌సీలో 19బెడ్స్‌ను ఏర్పాటు చేశాం. ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో కూడా డయాలసిస్ యూనిట్స్‌ను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించాం. అంతేకాకుండా నియోజకవర్గంలో ఏడు చోట్ల కోవిడ్ సమయంలో తీవ్ర పరిస్థితులను ఎదుర్కొనేందుకుగాను ఐసొలేషన్ యూనిట్లను ఏర్పాటు చేశాం. సోంపేట, ఎంఎస్‌పల్లి, బట్టిగళ్లూరు, కంచిలి తదితర ఆస్పత్రుల్లో రూ.70లక్షలతో పనులు చేశాం.

- పిరియా విజయ,
వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి,
ఇచ్ఛాపురం




## అభివృద్ధి పథం సంక్షేమ రథం

**వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన లబ్ధి** (కొన్ని పథకాలు..)

| పథకం | లబ్ధిదారులు | లబ్ధి(రూ.లక్షల్లో) |
|---|---|---|
| వైఎస్సార్ రైతు భరోసా | 36,892 | 20,547.74 |
| యంత్ర సేవా పథకం | 41 | 240.87 |
| వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు | 10,164 | 195.59 |
| వైఎస్సార్ ఉచిత పంటల బీమా | 2,873 | 318.16 |
| వైఎస్సార్ కాపు నేస్తం | 606 | 317.40 |
| జగనన్న చేదోడు | 1,610 | 564.20 |
| ఈబీసీ నేస్తం | 620 | 174.45 |
| జగనన్న విద్యా దీవెన | 6,884 | 4,588.16 |
| జగనన్న వసతి దీవెన | 6,547 | 1,814.76 |
| జగనన్న తోడు | 4,320 | 1,713.10 |
| వైఎస్సార్ పెన్షన్ కానుక | 43,444 | 52,617.78 |
| వైఎస్సార్ చేయూత | 24,896 | 13,161.19 |
| వైఎస్సార్ సున్నావడ్డీ(ఎస్‌హెచ్‌జీ) | 84,522 | 2,443.85 |
| వైఎస్సార్ ఆసరా | 66,971 | 12,325.42 |
| మత్స్యకార భరోసా | 4,220 | 1,670.10 |
| మత్స్యకార డీజిల్ సబ్సిడీ | 415 | 32.57 |
| వైఎస్సార్ వాహనమిత్ర | 1,192 | 241.90 |
| జగనన్న అమ్మ ఒడి | 30,235 | 17,598.45 |
| జగనన్న విద్యా కానుక | 38,267 | 1,066.35 |
| జగనన్న గోరుముద్ద | 34,569 | 1,365.52 |
| వైఎస్సార్ ఆరోగ్యశ్రీ | 3,464 | 2,215.70 |
| పేదలకు ఇల్లు | 926 | 319.00 |

## ఆదిత్యుని ఆదాయం 2.. వ్యయం 8

● అరసవల్లి క్షేత్రంలో ఘనంగా ఉగాది ఆస్థానం


ఆలయంలో పంచాంగ పఠనం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన అనివెట్టి మండపంలో ఆగమ పండితుల నడుమ పంచాంగ శ్రవణం నిర్వహించారు. ముందుగా ఆలయానికి చెందిన కొత్త అకౌంట్స్ పుస్తకాలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆరు రుచులతో ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. సంప్రదాయంగా క్రోధి నామ సంవత్సర పంచాంగ పఠనం కార్యక్రమం స్థానిక అనివెట్టి మండపంలో జరిపించారు. ముందుగా ఆదిత్యుని రాశిఫలాలను ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చదివి వినిపించారు. ఆదిత్యుని నక్షత్రం విశాఖ అని, తులారాశి అని.. ఈమేరకు ఆదాయం 2.. వ్యయం 8 గానూ ఈ ఏడాది ఉంటుందని వివరించారు. అనంతరం భాస్కరభట్ల నర్సయ్య శర్మ ఉగాది ప్రాశస్త్యాన్ని, పంచాంగ శ్రవణ విశిష్టతను భక్తులకు ఉపదేశించారు. తర్వాత భక్తులకు వారి వారి నక్షత్ర,రాశిఫలాలను తెలియజేశారు.

**అర్చకులకు ఘన సన్మానం**

ఉగాది సందర్భంగా దేవదాయ శాఖ తరఫున డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఆలయ అర్చకులు ఇప్పిలి రాజేశ్వర కాశ్యప శర్మ, ఇప్పిలి ఫణీంద్ర శర్మ, వేదపండితుడు దర్భముళ్ల శ్రీనివాస శర్మలకు ఉగాది పురస్కారాలను, ఒక్కొక్కరికి రూ.10,116 నగదును, ప్రశంసా పత్రాన్ని ట్రస్ట్ బోర్డు చైర్మన్ జోగి సన్యాసిరావు, ప్రధానార్చకులు శంకరశర్మలు సంయుక్తంగా అందజేసి ఘనంగా సత్కరించారు. అలాగే వీరితో పాటు ఆలయంలో పని చేస్తున్న అర్చకులు, సూర్యనమస్కార పండితులకు కూడా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బీఎస్ చక్రవర్తి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

## ● కోటి ఆశలతో.. కొత్త వత్సరం

కొత్త ఏడాదికి కోటి ఆశలతో స్వాగతం పలికారు. రాజకీయ నాయకులు పంచాంగ శ్రవణాల్లో పాల్గొన్నారు. రైతులు ఏరువాక చేశారు. ఉగాది పచ్చడి రుచులను అంతా ఆస్వాదించారు.


ఉగాది సందర్భంగా శ్రీకాకుళంలోని ఓ నగల దుకాణంలో కొనుగోలుదారుల సందడి


శ్రీకాకుళంలో ఉగాది పచ్చడి స్వీకరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు


పోలాకి: ఉగాది సందర్భంగా నాగలి పట్టి దుక్కి దున్నుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్


మెళియాపుట్టి: పాత్రలోవ గ్రామంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

## క్లుప్తంగా

### సరదాగా కాసేపు..



ఫరీదుపేట నారప్ప చెరువులో చేపల వేట సందడి

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలోని నారప్ప చెరువులో మంగళవారం ఊరంతా కలిసి చేపలు పట్టారు. గ్రామంలో దండోరా వేయటంతో పలువురు చెరువులోకి దిగి ఇలా వేట వేశారు. దీంతో చెరువులో సందడి నెలకొంది.

### పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



పేద ముస్లింలకు రంజాన్ తోఫా వస్తువుల పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక జీటీ రోడ్డులో ఉన్న జామియా మసీదులో రంజాన్ పండుగ సందర్భంగా 100 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కింద బియ్యం, చీరలు, సేమియా, పంచదార, పాల ప్యాకెట్లు, లుంగీలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. సూర శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో ఈ పంపిణీ జరిగింది. మసీదు అవసరమైన బోర్ వెల్ వేయించేందుకు శ్రీనివాసరావు ప్రకటించారు. కార్యక్రమంలో ముఫ్తీ జియావుల్ రెహ్మాన్, వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షులు సలీంఖాన్, ఇన్‌స్పెక్టర్ సాజిద్, రియాజ్, మసీదు అధ్యక్షులు మహిబుల్లా ఖాన్, అమిరుల్లా బేగ్, హాజీ భయ్య, అక్బర్ భాషా, షకుర్ ఖాన్, జాఫర్ భాయ్, జిలానీ, సునీల్ భాషా, బహదూర్ జాని, ఇర్ఫాన్ భాషా, గుత్తి రఫీ, అబ్దుల్ షఫీ, మతాబ్ ఖాన్, అబ్దుల్ వహాబ్, చంపామసీదు కమిటీ రజాక్, ముబారక్, రోషన్ భాషా తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం ఇఫ్తార్ విందు జరిగింది.

### వసంత నవరాత్రులు ప్రారంభం



టి.బరంపురంలో ప్రారంభమైన వసంత నవరాత్రులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని టి.బరంపురంలో శ్రీరామ నవమి వసంత రాత్రుల ఉత్సవాలు మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక సీతారాముల ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ ఉత్సవాలను ప్రత్యేక పూజా కార్యక్రమాల ద్వారా ప్రారంభించారు. ఈ నెల 17 వరకు ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### భక్తుల దాహం తీరేలా..



కొత్తమ్మతల్లి ఆవరణలో చలివేంద్రంను ప్రారంభిస్తున్న చైర్మన్ బోయిన మాధవి

కోటబొమ్మాళి, టెక్కలి: శ్రీకొత్తమ్మతల్లి ఆలయ ఆవరణలో ఉగాది పండగను పురస్కరించుకొని ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున భక్తులతో పాటు రోడ్డుపై ప్రయాణిస్తున్న వారికి తాగునీరు అందించేందుకు చలివేంద్రం ప్రారంభించామని, ఎండల తీవ్రత తగ్గేవరకూ కొనసాగిస్తామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఈఓ వి.రాధాకృష్ణ, ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు బాడాన గోవిందరావు, బోయిన కృష్ణారావు పాల్గొన్నారు. టెక్కలి పరిసర ప్రాంతాల్లోనూ ఉగాది సందర్భంగా పలు చోట్ల చలివేంద్రాలు ప్రారంభించారు.

### ఘనంగా లచ్చమాంబతల్లి వార్షికోత్సవం

బూర్జ: బూర్జ గ్రామంలో చాకలి లచ్చమాంబతల్లి 6 వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం నుంచి గురువారం వరకు నిర్వహించనున్నట్లు బూర్జ గ్రామ రజక సంఘ యూత్, ప్రజలు తెలియ జేశారు. మూడు రోజుల పాటు రాత్రి వేళల్లో వినోద కార్యక్రమాలు నిర్వహించాలని, బుధవారం తల్లికి ముర్రాటలు చెల్లించేందుకు నిర్ణయించారు. గురువారం అన్న సమారాధన జరుపుతున్నట్లు తెలిపారు.

# కొత్త ఉత్సాహంతో..

కొత్త ఏడాదిలో ఎన్నికల ప్రచారాలను అభ్యర్థులు ఉత్సాహంగా నిర్వహించారు. హారతులు అందుకుంటూ, ఆత్మీయతను పంచుతూ ఊరూరా తిరిగారు.



నందిగాం: కణితూరులో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



రణస్థలం: పాతర్లపల్లిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మటన్ కొడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్



శ్రీకాకుళంలో ప్రచారానికి ధర్మాన సిద్ధం..



కాశీబుగ్గ: మందస మండలంలోని ప్రచారంలో జనం మధ్యలో చిన్నారిని ఎత్తుకున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



జలుమూరు: మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్



మెళియాపుట్టి: పాత్రలోవ గ్రామంలో ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



టెక్కలిలో ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆత్మీయంగా కరచాలనం చేస్తున్న స్థానికులు



సోంపేట: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయపై పూలు వేసి ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

## 11న రిట్టపాడులో పైలా వర్ధంతి



కొరారింగ్ తాళబద్రలో కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పలాస: శ్రీకాకుళ విప్లవోద్యమ నాయకుడు, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ కేంద్ర కమిటీ మాజీ నాయకుడు, రాష్ట్ర కార్యదర్శి పైలా వాసుదేవరావు వర్ధంతి ఈ నెల 11న రిట్టపాడు గ్రామంలో ఆయన స్థూపం వద్ద నిర్వహించనున్నట్లు అరుణోదయ జిల్లా కార్యదర్శి కె.సోమేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు పలాస మండలం కొరారింగ్ గిరిజన గ్రామంలో మంగళవారం ప్రచారం చేశారు. కరపత్రాలను పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పైలా పోషించారని వివరించారు. జిల్లాలో పుట్టిన పైలా భారత విప్లవోద్యమం అగ్రనాయకుల్లో ఒకరుగా నిలిచారన్నారు. ఉన్నత ఉద్యోగాలను వదిలి విప్లవబాట పట్టిన గొప్ప మేధావి అని కొనియాడారు. ఈ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు ఇస్మాయల్, పాపారావు, భువన్, సుబ్బారావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## 'మద్దిల వాణికి న్యాయం చేయాలి'



వాణి పోరాటానికి మద్దతు తెలుపుతున్న మహిళా సంఘాల నాయకులు

పలాస: పలాస మండలం గురుదాసుపురం గ్రామానికి చెందిన మద్దిల వాణికి న్యాయం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె చేస్తున్న పోరాటానికి మద్దతు తెలుపుతూ మంగళవారం ఆమెను కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కుసుమ మాట్లాడుతూ గురుదాసుపురానికి చెందిన వాణి మరో మీన కాకూడదని, వాణి చేస్తున్న న్యాయపోరాటానికి మహిళాలోకం మద్దతు తెలిపాలన్నారు. గురుదాసుపురానికి చెందిన సార్ర ప్రశాంత్ వాణిని గత ఐదేళ్లుగా ప్రేమించి పెళ్లి చేసుకొని మోసం చేశాడన్నారు. వాణి సమస్యను ఉద్దానం ప్రాంతంలోని 5 పంచాయతీల పెద్దల సమక్షంలో విచారించి పెళ్లి ప్రకటన చేసి, ఇరువురికి దండల మార్చి పెద్దల సమక్షంలోనే వారి ఇంటికి పంపించారని తెలిపారు. ఇప్పుడు మరొక మహిళను వివాహం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడని, దీనిపై వాణి న్యాయ పోరాటం చేస్తోందన్నారు. ఈ పోరాటానికి అన్ని మహిళా సంఘాలు మద్దతు తెలపాలని ఆమె కోరారు. సంఘీభావం తెలిపిన వారిలో ఉత్తరాంధ్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పి.నాగమణి, పీఓడబ్ల్యూ జిల్లా నాయకులు బర్ల జానికి, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ, బల్ల గోపి, పోలారావు తదితరులు ఉన్నారు.

## ఆర్ఎస్ఎస్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

శ్రీకాకుళం కల్చరల్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం సందర్భంగా పట్టణంలోని 80 అడుగుల రోడ్డులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ముందుగా జరిగిన సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి గణేష్ గురూజీ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని విరివిగా ప్రచారం చేయాలని కోరారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ విజయాదిత్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తి దేశభక్తి కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నగర సంచాలక్ వంగా మహేష్, వారణాసి సందీప్, జామి బాల కామేశ్వరరావు, బండారు శ్రీనివాసరావు, జగదీశ్వరరావు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

- 'మేధా ఇన్‌స్టిట్యూట్' ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచీ ఇంగ్లీషు మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లీష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ.... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లీషు స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. 'మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం' అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లీష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. 'ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజి స్ట్రేషన్ లింకు వస్తుంది. లేని పక్షంలో 9866006662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం' అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రి య ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

క్యూఆర్ కోడ్

## జూన్ 1న కాలేజీలు పునఃప్రారంభం

- 2024-25 వార్షిక క్యాలెండర్ విడుదల చేసిన ఇంటర్మీడియెట్ బోర్డు
- మే నెలాఖరు వరకు వేసవి సెలవులు



ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల

శ్రీకాకుళం న్యూకాలనీ: జూనియర్ కళాశాలలు జూన్ ఒకటో తేదీన పునఃప్రారంభం కానున్నాయి. అదే రోజు నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు క్లాసులు సైతం మొదలుకానున్నాయి. ఈ మేరకు తాజాగా ఇంటర్మీడియెట్ బోర్డు 2024–25 నూతన విద్యా సంవత్సరానికిగాను వార్షిక క్యాలెండర్‌ను, షెడ్యూల్‌ను విడుదల చేసింది. 2020 మార్చిలో విజృంభించిన కరోనా వైరస్ (కోవిడ్)తో అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థ ప్రభుత్వ పకడ్బందీ చర్యలతో రెండేళ్ల నుంచి పూర్తిస్థాయిలో గాడిలో పడింది. ఈ ఏడాది 2024లో యథావిధిగా జూన్ ఒకటో తేదీన కళాశాలలు రీఓపెన్ కానున్నాయి. జిల్లాలో మొత్తం 168 జూనియర్ కళాశాలలు ఉండగా.. ఇందులో 38 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి.

**ప్రభుత్వ కాలేజీల్లో చేరండి**

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇప్పటికే అధికారుల ఆదేశానుసారం క్యాంపెయినింగ్‌లు నిర్వహించారు. కళాశాలలకు సమీప ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అడ్మిషన్ డ్రైవ్స్‌ను నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలల్లో నాడు–నేడు కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉన్న వసతులు, సౌకర్యాలు, ల్యాబ్‌లు, డిజిటల్ విద్య, ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ద్వారా బోధన, అధ్యాపకుల పనితీరు, బోధన విధానాలు, ఇంటర్ విద్యతో లభిస్తున్న భవిష్యత్ అవకాశాలను తెలియజేసి ఆకర్షితులను చేశారు. ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో గణనీయంగా అడ్మిషన్లు జరిపేలా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

**222 రోజులు పనిదినాలు..**

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి జూనియర్ కళాశాలలు 222 పనిచేయనున్నాయి. 2025 మార్చి 31 ఆఖరి పనిదినంగా, ఏప్రిల్ 1 నుంచి 2025 జూన్ ఒకటి వరకు వేసవి సెలవులను ప్రకటించారు. ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా సాంస్కృతిక వారోత్సవాలను అక్టోబర్ ఆఖరివారంలో నిర్వహించాలని, స్పోర్ట్స్ వారోత్సవాలను నవంబర్ ఆఖరివారంలో నిర్వహించాలని, అలాగే సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫెయిర్‌ను 2025 జనవరి 8, 9 తేదీల్లో నిర్వహించాలని క్యాలెండర్‌లో పేర్కొన్నారు.

### ప్రభుత్వ కళాశాలలపై ఆసక్తి చూపిస్తున్నారు



ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో పాఠాలు బోధించడంతోపాటు అన్ని వ సతులు, సౌకర్యాలతో విద్యను అందించేలా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది కాబట్టి ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. సెలవులకు ముందు అడ్మిషన్స్ డ్రైవ్స్‌పై సమీప పాఠశాలలు, గ్రామాల్లో క్యాంపెయినింగ్‌లు నిర్వహించాం.

– కోట ప్రకాశరావు, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి(డీఐఈవో), శ్రీకాకుళం

### వార్షిక క్యాలెండర్ పక్కాగా అమలుకావాలి..



2024–25 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్‌బోర్డు వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేసింది. వార్షిక క్యాలెండర్‌ను పక్కాగా అమలు చేయాలి. ఈ క్యాలెండర్ ప్రకారం జూన్ 1 నుంచి అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు పునఃప్రారంభమవుతాయి. తరగతులు కూడా మొదలవుతాయి. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు పరీక్షల నిర్వహణ, సెలవులు ప్రకటించడం జరుగుతుంది.

– ప్రగడ దుర్గారావు, ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్ఐఓ, శ్రీకాకుళం

## వైఎస్సార్ సీపీలోకి జోరుగా చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు



టెక్కలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా కండువాలు వేసుకున్న కార్పెంటర్లు



తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరినవారితో డాక్టర్ సీదిరి అప్పలరాజు



కృష్ణదాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బమ్మిడి రాజు, డీఎల్‌పురం టీడీపీ కార్యకర్తలు

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో పెదపాడులో గల క్యాంప్ కార్యాలయంలో మంగళవారం శ్రీ కూర్మం పంచాయతీ, నగరాలపేటకు చెందిన 50 యువకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

**వైఎస్సార్‌సీపీ వెంట కార్పెంటర్లు**

టెక్కలి: టెక్కలి మండలానికి చెందిన కార్పెంటర్లు వైఎస్సార్‌సీపీ వెంట నడిచారు. గడిచిన ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందడంతో వాటికి ఆకర్షితులై మంగళవారం టెక్కలిలో ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో పార్టీకు మద్దతు తెలియజేస్తూ కండువాలను వేసుకున్నారు. అనంతరం దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పెంటర్లతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు కె.అజయ్, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్, నాయకులు కె.రవికుమార్‌గాంధీ, ఎన్.సోమేష్, వి.అశోక్, బుడ్డు, జగదీష్ తో పాటు మరి కొంత మంది పాల్గొన్నారు.

**వైఎస్సార్ సీపీలోకి మూలిపాడు గ్రామస్తులు**

కాశీబుగ్గ: మందస మండలం మూలిపాడు పంచాయతీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మందస మండలం చిన్నకోష్ట గ్రామంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రచారం నిర్వహిస్తుండగా వీరంతా పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, మందస మండల అధ్యక్షులు అగ్గున సూర్యం, మూలిపాడు పెద్దలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

**డీఎల్‌పురంలో టీడీపీ ఖాళీ**

పోలాకి: మండలంలోని డీఎల్‌పురం పంచాయతీ పరిధిలో సత్రవుపేట, డీఎల్‌పురం, చింతాడపేట గ్రామాలకు చెందిన దాదాపు 150 మంది టీడీపీ కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గతంలో టీడీపీ తరపున సర్పంచ్‌గా పోటీచేసిన బమ్మిడి రాజు క్యాడర్‌తో పాటు పార్టీలో చేరారు. అలాగే స్థానిక బీసీ కాలనీ నుంచి 50 కుటుంబాలు జగన్ సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. మరోవైపు డీఎల్ పురం పంచాయతీలో కొద్దిమంది పెత్తందార్లు తప్ప దాదాపుగా టీడీపీ ఖాళీ అయిపోయినట్లు సమాచారం. పార్టీలో చేరిన వారిని డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఏఎంసీ చైర్మెన్ దుంపల భాస్కరరావు, మండలపరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, స్థానిక సర్పంచ్ తమ్మినేని వెంకటరత్నం, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ సీనియర్ నాయకులు చింతు సింహాచలం, చింతాడ ప్రసాద్‌లు అభినందించారు.

స్థానిక నాయకులు గురువు బాలక్రిష్ణ, చింతాడ భీమారావు తదితర నాయకులతో సమన్వయంతో పనిచేసి పార్టీలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు.

## తెరవే ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్:

తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో శ్రీక్రోధి నామ ఉగాది వేడుకలు మంగళవారం సాయంత్రం ఒక ప్రైవేటు హోటల్‌లో జరిగాయి. ఈ సందర్భంగా ఉత్తరావిల్లి నాగేశ్వరరావు రచించిన 'ఉత్తారవల్లి ఊసులు' పుస్తకాన్ని సెట్ శ్రీ విశ్రాంత సీఈఓ సురంగి మోహనరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెరవే ఒక సొంత భవనం కోసం ప్రయత్నించాలని కోరారు. అందుకు తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఇందులో రచయితలంతా తెలుగు భాష కోసం ఎంతో కృషి చేస్తున్నారని మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కవులు తమ కవితలను చదివి వినిపించారు. అలాగే చాడ శ్రీనివాసరావు, భోగెల ఉమామహేశ్వరరరావులు ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. కార్యక్రమంలో తెరవే అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, ఆర్‌వీ రమణమూర్తి, తెరవే వ్యవస్థాపకులు కోనె శ్రీధర్, బారువ కోమలరావు, హిందీమంచ్ అధ్యక్షులు దొంతం పార్వతీశం, నిక్కు హరిసత్యన్నారాయణ, సామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యం.వి.మల్లేశ్వరరావు, వి.రాజారావు, జంధ్యాల శరత్‌బాబు, వాండ్రంగి కొండలరావు, పొట్నూరు వెంకటరావు, ఎం.శ్రీనివాసరావు, చిరంజీవి, శ్రీనివాస్, తంగి ఎర్రమ్మ, బి.వెంకటరావు, సూర్యనారాయణ, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు